ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా

శుక్రవారం 19 జూన్ 2026 పేజీలు : 12




## నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం

**మంత్రి పొన్నం ప్రభాకర్**



కరీంనగర్ బ్యూరో (విజన్ ఆంధ్ర) జూన్ 18.

నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. జూన్ 21 వ తేదీన నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ లో ఉచిత ప్రయాణం అందించాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందాన్నారు. నీట్ రాసే విద్యార్థులకు హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందించాలని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి కి ఆదేశాలు జారీ చేసినట్లు ప్రకటన లో పేర్కొన్నారు.



## పవన్‌కళ్యాన్‌పై.

## దేశద్రోహం కేసు పెట్టాలి



- గద్దరన్నకు, సినిమాకు ఏమి సంబంధం..?
- రేవంత్ రెడ్డి పాలనలో మన భావజాలంపై దాడి
- కరీంనగర్‌లో కవిత

11



## దొర గారి మెప్పు కోసమే కొప్పుల, ఆర్ఎస్పీ ఆరాటం

10



## రూ.2,000 కోట్ల టెండర్లపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్

# పానీపూరి ఘటన బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి: ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన ప్రభుత్వ విప్..



### ఆహార విక్రయ కేంద్రాల్లో ప్రత్యేక తనిఖీలకు ఆదేశాలు

రాజన్న సిరిసిల్ల, జూన్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో): తంగళ్లపల్లి మండలం మండేపల్లి పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో పానీపూరి తిని అస్వస్థతకు గురైన చిన్నారులు, పెద్దలకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి గురువారం పరామర్శించిన ఆయన, వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎనిమిది మంది కోలుకుని డిశ్చార్జ్ అయ్యారని, మిగిలిన వారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. పానీపూరి విక్రయించి పలువురు అస్వస్థతకు గురికావడానికి కారణమైన నిర్వాహకుడిపై ఇప్పటికే కేసు నమోదు చేసి చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడంతో పాటు వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

### ఆహార దుకాణాలపై ప్రత్యేక తనిఖీలు

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఫుడ్ ఇన్స్పెక్టర్, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సిరిసిల్ల, వేములవాడతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆర్డీఓ శ్రీధర్ బాబు, డీఎస్పీ నాగేంద్రచారి, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, వైద్యులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారి పిల్లలను అంగన్వాడిలో చేర్పించాలి

-సర్పంచ్ పొనగంటి కుమార్.

కమాన్ పూర్ జూన్ 18.(విజన్ ఆంధ్ర ) ప్రతి చిన్నారులను అంగన్వాడి బడుల్లో చేర్పించాలి అని నాగారం సర్పంచ్ పోనగంటి కుమార్, ఉప సర్పంచ్ పుద్దాల శ్రీనివాస్ అన్నారు. కమాన్ పూర్ మండలంలోని నాగారం గ్రామపంచాయతీ లింగాల అంగన్వాడి సెంటర్లలో సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ చిన్నారులకు ప్రభుత్వపరంగా వచ్చిన యూనిఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వపరంగా అంగన్వాడీలకు కోట్లాది రూపాయలు విడుదల చేస్తుందని పేర్కొన్నారు. చిన్నారులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించడం జరుగుతుందని గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వం అన్ని విధాల ఆహారాన్ని అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త అమల తదితరులు పాల్గొన్నారు

## గుండారం కుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా దామెర దేవయ్య.



కమాన్ పూర్ జూన్ 18.(విజన్ ఆంధ్ర ) కమాన్ పూర్ మండలం గుండారం గ్రామ మాదిగ కుల సంఘం అధ్యక్షునిగా దామెర దేవయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుండారం గ్రామంలో మాదిగ కులస్తులంతా ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని దామెర దేవయ్య పేరును దామెర లింగయ్య, అవును ది. మొండయ్య , పేరును ప్రతిపాదించారు. దీంతో కులస్తులంతా కలిసి దామెర దేవయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించిన కుల బాంధవులకు అందరికీ ధన్యవాదాలు అని ఏదైనా సమస్య ఉన్నచో తన వంతుగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని దేవయ్య తెలిపారు

# పెద్దమ్మ తల్లి ఆలయంలో ఘనంగా బోనాల సంబరాలు

### భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించిన ముదిరాజుల కులస్తులు

ముత్తారం, జూన్ 18 (విజన్ ఆంధ్ర) మండలంలోని ఓడేడు గ్రామంలో గురువారం ముదిరాజుల కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి ఆలయంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ కవిత కిషన్ రెడ్డి,మాజీ సర్పంచ్ సిరికొండ బక్కారావు హాజరయ్యారు.గ్రామ ముదిరాజుల సంఘం అధ్యక్షుడు కందుల నరేష్ బోనం ఎత్తుకొని గ్రామంలోని ముదిరాజుల కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ తల్లికి బోనం సమర్పించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకుని ఆటపాటలు,డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామానికి సుఖశాంతులు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజుల సంఘం అధ్యక్షుడు కందుల నరేష్,నరెడ్ల సదానందం,నరెడ్ల స్వామి,నరెడ్ల రమేష్, సంఘం కార్యదర్శి కొండిల్ల ఉమేష్,ఉప సర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్, వార్డు సభ్యులు పూదరి స్వప్న మహేందర్, పొలవేణి రవళి శ్రవణ్, మాజీ ఉపసర్పంచ్ భాను, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, ముదిరాజుల కులస్తులు తదితరులు పాల్గొన్నారు.



# భక్తుల కానుకల వెల్లువ..

### శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి రూ.1.70 కోట్ల హుండీ ఆదాయం



వేములవాడ, జూన్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో గత 28 రోజుల కాలంలో భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ అధికారులు గురువారం లెక్కించారు. హుండీ లెక్కింపులో రూ. 1,70,65,200 నగదు ఆదాయంగా వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అదనంగా 80 గ్రాముల 500 మిల్లీగ్రాముల మిశ్రమ బంగారం, 7 కిలోల 400 గ్రాముల మిశ్రమ వెండి భక్తులు సమర్పించినట్లు తెలిపారు. ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి, కరీంనగర్ ఏసీ కార్యాలయ పరిశీలకులు రాజమౌళి, డీఈవో భాస్కర శర్మ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది, శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు

## శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించుకున్న రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ గుంజ రేణుక నారాయణ



వేములవాడ, జూన్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో): రాజన్న సిరిసిల్ల జిల్లా వేము లవాడలోని శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవ స్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ శ్రీమతి గుంజ రేణుక నారాయణ గురువారం సందర్శించారు. ఆల యానికి చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.పూజల అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందజేయగా, అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు, ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు శ్రీ భీమేశ్వర స్వామి ఆలయ చరిత్ర, ఆధ్యాత్మిక విశిష్టతను ఆమెకు వివరించారు. స్వామివారి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని గుంజ రేణుక నారాయణ ఆకాంక్షించారు





## బస్సు సౌకర్యం కల్పించాలి

### సర్పంచ్ చిగురు నరేష్ వినతి

ముస్తాబాద్ జూన్18(విజన్ఆంధ్ర)
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని బదనకల్ గ్రామానికి సిరిసిల్ల, సిద్ధిపేట ప్రాంతాలకు వెళ్లే శ్రామికులు, వివిధ గ్రామాల నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, అలాగే సిద్దిపేటలో ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థుల రవాణా సౌకర్యార్థం గ్రామానికి నిత్య బస్సు సేవలు కల్పించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ చిగురు నరేష్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిగురు నరేష్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలు, విద్యార్థులు, కార్మికులు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, గ్రామానికి నేరుగా బస్సు సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరినట్లు తెలిపారు. సిరిసిల్ల డిపో మేనేజర్, సిద్ధిపేట డిపో ఇన్‌చార్జ్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన వారిలో వార్డు సభ్యుడు తుపాకుల యాదగిరి గౌడ్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎనగందుల నరసింహులు, చిగురు ప్రవళిక తదితరులు ఉన్నారు. వినతిపత్రంపై స్పందించిన అధికారులు గ్రామ అవసరాన్ని గుర్తించి సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే సిరిసిల్ల డిపో మరియు సిద్దిపేట డిపో నుంచి బదనకల్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల సానుకూల స్పందనపై సర్పంచ్ చిగురు నరేష్ హర్షం వ్యక్తం చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న బస్సు సేవలను గ్రామ ప్రజలు, విద్యార్థులు, శ్రామికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

# ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు

### - నకిలీ విత్తనాలు, బిల్లుల్లేని విక్రయాలపై కఠిన చర్యలు



విజన్ ఆంధ్ర : చిగురుమామిడి:
రానున్న వానకాలం 2026 సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా మండల కేంద్రంలోని ఆగ్రోస్‌తో పాటు ప్రైవేట్ విత్తన దుకాణాల్లో అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ కమిషనర్, జిల్లా కలెక్టర్ల ఆదేశాల మేరకు స్థానిక సీఐ రమేష్, మండల వ్యవసాయ అధికారి పున్నం చందర్‌రెడ్డి, ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్‌లు తనిఖీల్లో పాల్గొన్నారు. దుకాణాల్లో ఉన్న ఎరువులు, విత్తనాల నిల్వలు, ధరల పట్టికలు, స్టాక్ రిజిస్టర్లు, ఇతర రికార్డులను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్, ఏఓ పున్నం చందర్‌రెడ్డి మాట్లాడుతూ.. లాభాపేక్షతో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే సహించబోమని హెచ్చరించారు. ప్రతి దుకాణదారుడు స్టాక్ రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించడంతో పాటు నిల్వల వివరాలను రైతులకు కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. విత్తన ప్యాకెట్లు, ఎరువుల బస్తాల విక్రయాలకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని, బిల్లుల్లేని విక్రయాలు జరిపితే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను ఇతర అవసరాలకు అక్రమంగా మళ్లించడం, కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌మార్కెట్‌లో విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్, ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్ హెచ్చరించారు. వానకాలం సాగు సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏఓ పున్నం చందర్‌రెడ్డి తెలిపారు. మండలానికి అవసరమైన యూరియా, డీఏపీతో పాటు ఇతర ఎరువులు, విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతులు గుర్తింపు పొందిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేసి, రసీదులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు

# సింగరేణిపై రాజకీయ దాడులు మానుకోవాలి

### - కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం, ఐఎన్టీయూసీ లక్ష్యం: ధర్మపురి



రామగిరి జూన్ 18(విజన్ ఆంధ్ర )
సింగరేణి కోల్ మైన్ లేబర్ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి అధ్యక్షతన గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సెంట్రల్ సీనియర్ ఉపాధ్యక్షులు ధర్మపురి మాట్లాడుతూ పలు అంశాలపై స్పందించారు. పది సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి సమస్యలను నిర్లక్ష్యం చేసి, కార్మికుల జీవితాలతో చెలగాటమాడిందని ఆయన విమర్శించారు. ముఖ్యంగా కార్మికుల మారుపేర్ల సమస్యలను సంవత్సరాల పాటు పెండింగ్‌లో ఉంచి జాప్యం చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు చేపడుతుండటాన్ని జీర్ణించుకోలేక కొందరు నాయకులు కార్మికుల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఒకవైపు టీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మరోవైపు మాజీ మంత్రి హరీష్ రావు సింగరేణిపై చేస్తున్న దండయాత్రను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సింగరేణి సంస్థను, కార్మికుల ప్రయోజనాలను కాపాడే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం మరియు ఐఎన్టీయూసీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నన్ని రోజులు కార్మికులను గాలికి వదిలేసి, ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత సవతి ప్రేమ చూపించడం సమంజసం కాదన్నారు. కార్మికుల సంక్షేమం కోసం నిజాయితీగా పనిచేసే వారికే కార్మికులు మద్దతు ఇస్తారని, కేవలం మాటలతో కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తే కార్మిక క్షేత్రంలోనే తగిన సమాధానం చెబుతారని ధర్మపురి హెచ్చరించారు

# దీక్ష మాంటిసోరి స్కూల్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న శ్రావణి

జగిత్యాల ఆర్ సి , జూన్18, (విజన్ ఆంధ్ర )
జగిత్యాల పట్టణంలో హౌసింగ్ బోర్డ్ కాలనిలో నూతనంగా స్థాపించిన దీక్ష మాంటిసోరి స్కూల్ ప్రారంభోత్సం సందర్భంగా యాజమాన్యానికి, టీచర్లు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులకు జగిత్యాల బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జి భోగ శ్రావణి శుభాకాంక్షలు తెలిపారు. జగిత్యాల పట్టణంలో గురువారం దీక్ష మాంటిసోరి స్కూల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ... ఈ ప్రాంతం లోని పిల్లల తల్లిదండ్రులకు ఎంతో ఉ పయోగంగా ఉంటుంది. తమ పిల్లల చదువు కోసం హైదరాబాద్ వెళ్ళకుండా స్థానికంగానే మాంటిసోరి మేతడ్ తో స్కూల్ అందుబాటులో ఉండడంతో పేరెంట్స్ కు అన్ని విధాలుగా ఉపయోగంగా ఉంటుందన్నారు. తమ పిల్లల భవిష్యత్తు కోసం కొంతమంది తల్లిదండ్రులకు భారమైన ప్రవేటు,కార్పోరేట్ స్కూళ్ళో చదివిస్తున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రవేటు స్కూళ్ళు వారి ఆశలకు అనుగుణంగా మంచి విద్యను అందించాలన్నారు. దీక్ష మాంటిసోరి స్కూల్ కి మంచి విద్యా సంస్థగా పేరు ఉన్నది. విద్యలో మంచి స్టాండర్డ్స్ మేయింటెన్



చేయడంతో పాటుగా, క్రీడలు, నాలెడ్జికి సంబంధించిన అంశాలలో విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా వారిని ప్రోత్సహిస్తారన్నారు. భవిష్యత్తులో ఈ స్కూల్ నుండి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించే విద్యార్థులు తయారవ్వాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. ఏ దేశ భవిష్యత్తు అయినా తరగతి గదిలోనే తయారవుతుందని, దేశ భవిష్యత్తుకు పునాదులు విద్యార్థులు. అలాంటి ముఖ్యమైన విద్యను అందించే విషయాన్ని ఆర్థిక కోణంలో కాకుండా సామాజిక కోణంలో ఆలోచించి అందుకు అనుగుణంగా యాజమాన్యాలు కృషి చేయాలి. దీక్ష మాంటి సోరి స్కూల్ వంటి మంచి విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థులు బాగా చదువుకోవాలని కోరుకుంటున్నానని అన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు చిన్న సూచనను ఇస్తూ మీ పిల్లలకు స్మార్ట్ ఫోన్ ఇవ్వకండి, అలవాటు చేయకండి. స్మార్ట్ ఫోను అడిక్ట్ అయితే పిల్లలు చదవరు, ఈ విషయంలో బాధ్యత అంతా తల్లిదండ్రులదే, ఫోన్ ఇవ్వకండి వాళ్ళ భవిష్యత్తు నాశనం చేయకండి అని కోరారు. ఇవ్వాళ్ళ ప్రవేటు స్కూళ్ళన్ని అపార్ట్ మెంట్ లలో నిర్వహిస్తున్నారని, ప్లే గ్రౌండ్స్ ఉండడం లేదు. కాని జగిత్యాల పట్టణములోని దీక్ష స్కూల్ లో, విద్యార్థులకు విద్యతో పాటుగా శారీరక ఆరోగ్యానికి స్పోర్ట్స్ కు కూడా చిన్న ప్లే గ్రౌండ్ ఉంది ఇలాంటివి ఉండాలని సూచించారు. విద్యార్థులకు రోజు ఒక గంట సేపు క్రీడలను నిర్వహించాలని నా సూచన అని చెప్పారు. మంచి టాలెంట్ ఉన్న వారిని క్రీడాకారులుగా ప్రోత్సహిస్తే రాష్ట్రానికి, దేశానికి పేరు తెస్తారని అన్నారు. జగిత్యాల దీక్షా స్కూల్ తన అత్యుత్తమ ప్రమాణాలతో అభివృద్ది చెందాలని, మరిన్ని శాఖలతో విస్తరిస్తూ విజయాలను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గద్దల లక్ష్మి, ఠాకూర్ పవన్ సింగ్, గాదాసు రాజేందర్, నారపాక అశోక్, కాశెట్టి తిరుపతి, మంచే రాజేష్ మరియు తదితరులు పాల్గొన్నారు

## అభయ యాప్ ఫేజ్-3 ప్రారంభం..

## 100 ఆటోలకు క్యూ ఆర్ కోడ్‌లు, డ్రైవర్లకు ప్రమాద బీమా

**రూ.50 ప్రీమియంతో రూ.1 లక్ష ప్రమాద బీమా..**

**ఆటో డ్రైవర్లకు పోలీసుల భరోసా**

**'మై ఆటో ఈజ్ సేఫ్' ఫేజ్-3తో**

**సురక్షిత ప్రయాణానికి మరింత భరోసా**



రాజన్న సిరిసిల్ల, జూన్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో):
ప్రయాణికుల భద్రతను మరింత పటిష్ఠం చేయడంతో పాటు ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న అభయ యాప్ (మై ఆటో ఈజ్ సేఫ్) ఫేజ్-3 కార్యక్రమాన్ని గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 100 ఆటోలకు అభయ క్యూ ఆర్ (ు=) కోడ్‌లను అనుసంధానం చేసి, ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా పత్రాలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఆటోలో ప్రయాణించే ప్రతి ప్రయాణికుడికి భద్రతపై పూర్తి నమ్మకం కల్పించడమే అభయ యాప్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆటోలో ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా డ్రైవర్ ఫొటో, మొబైల్ నంబర్, వాహన వివరాలు వెంటనే అందుబాటులోకి వస్తాయని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో యాప్ ద్వారా ఎమర్జెన్సీ కాల్ లేదా ఫిర్యాదు చేస్తే వాహనం లైవ్ లొకేషన్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరుతుందని, సమీప పోలీసులు వెంటనే స్పందించి అవసరమైన రక్షణ చర్యలు చేపడతారని వివరించారు. మహిళలు సహా ప్రతి ప్రయాణికుడు ఆటో ఎక్కే ముందు క్యూ ఆర్ కోడ్‌ను తప్పనిసరిగా స్కాన్ చేసుకోవాలని సూచించారు. ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, అసభ్య ప్రవర్తన, హిట్ అండ్ రన్ ఘటనలు, అలాగే ఆటోలో మరిచిపోయిన వస్తువులకు సంబంధించిన ఫిర్యాదులను కూడా అభయ యాప్ ద్వారా నమోదు చేయవచ్చని తెలిపారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని ఎస్పీ సూచించారు. ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేవలం రూ. 50 వార్షిక ప్రీమియంతో ప్రమాద మరణ బీమా కింద రూ. 1 లక్ష బీమా సౌకర్యాన్ని కల్పించేలా ప్రత్యేక సంస్థతో అనుసంధానం చేసి ప్రమాద బీమా పత్రాలు అందజేస్తున్నామని తెలిపారు. ఈ బీమాను ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సురేష్, ఆర్ఎస్ఐ శ్రీనివాస్, ఎస్ఐ శ్రీనివాస్, అభిచరణ్‌తో పాటు పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు

## తాండ్రియల ప్రభుత్వ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ ప్రారంభం



కథలాపూర్, జూన్ 18(విజన్ ఆంధ్ర):
మండలంలోని తాండ్రియల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)లో ప్రీ-ప్రైమరీ విద్యా కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కె. రాము పాఠశాలను సందర్శించి ప్రీ-ప్రైమరీ తరగతుల్లో నిర్వహిస్తున్న బోధనా కార్యక్రమాలను పరిశీలించారు. చిన్నారులకు అనుకూలంగా ఏర్పాటు చేసిన అభ్యాస వాతావరణం, ఆటల ద్వారా బోధన, రైమ్ టైం, స్టోరీ టైం, ప్రీ-న్యూమరసీ, ప్రీ-రైటింగ్ కార్యకలాపాలను ఆయన అభినందించారు. ప్రీ-ప్రైమరీ విద్యార్థుల విద్యా ప్రయాణానికి గుర్తుగా ప్రతి చిన్నారి తొలి అడుగు (ఫుట్ ప్రింట్)ను సేకరించి పాఠశాల రికార్డుల్లో భద్రపరిచే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వినూత్న కార్యక్రమం తల్లిదండ్రులు, గ్రామస్థులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా తన కుమార్తె గుండు వియాను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై విశ్వాసాన్ని చాటిన ప్రధానోపాధ్యాయుడు గుండు విజయ్ కుమార్‌ను డీఈఓ కె. రాము ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ (ఎస్ఓ), మందా చంద్రశేఖర్ రెడ్డి (ఏఎంఓ), నీరజ (కేజీబీవీ ఎస్ఓ), కిషన్ రావు (ఎస్-సీఎక్స్ హెచ్ఎం), ప్రసాద్ (సీఆర్పీ), ఉపాధ్యాయులు రవి, నరేష్, సత్య, మధు, అనూష, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు

## తెర్లుమద్దిలో

## నూతన కూరగాయల మార్కెట్ ప్రారంభం

**రైతులకు ప్రత్యక్ష విక్రయాలకు అవకాశం -- గ్రామస్థుల హర్షం**



ముస్తాబాద్, జూన్18(విజన్ఆంధ్ర) రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని తెర్లుమద్ది గ్రామ కశీరు ప్రాంతంలో గ్రామ పంచాయతీ నిధులతో సుమారు రూ. 2 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన రోజువారీ కూరగాయల మార్కెట్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. గ్రామ ప్రజలకు నాణ్యమైన, తాజా కూరగాయలు అందుబాటులో ఉండేలా ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలో కూరగాయలు సాగు చేసే రైతులు తమ పంటలను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే అవకాశం కల్పించడం వల్ల వారికి మెరుగైన ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ నూతన మార్కెట్‌ను గ్రామ సర్పంచ్ బైతి దుర్గమ్మ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మార్కెట్ ప్రారంభమైన సందర్భంగా గ్రామ ప్రజలు వ్యాపారుల వద్ద నుంచి కూరగాయలను కొనుగోలు చేసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సౌజన్య, వార్డు సభ్యులు బద్ధ రాములు, చిర్రం మహేష్, నెత్తేట్ల రమాదేవి, కొమ్మెట రాజు, కొమ్మెట రాజలింగయ్య, అంతడుపుల మంజుల దేవయ్య, కొండం విష్ణు, జంపెల్లి తిరుపతి, గోక దివ్యస్వామి, మామిండ్ల కానుకవ్వ శ్రీనివాస్‌తో పాటు గ్రామ ప్రజలు, కూరగాయల వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళలకు ప్రభుత్వం పెద్దపీట

**ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తాం**

**రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**మెట్ పల్లి వేములవాడ నూతన బస్ సర్వీస్ ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ విప్**



కథలాపూర్ జూన్ 18 (విజన్ ఆంధ్ర)
రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తూ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ, మారుమూల గ్రామాలకు సైతం బస్సు సౌకర్యం కల్పించనున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పెగ్గెర్ల గ్రామంలో 10 లక్షలతో నిర్మిస్తున్న మహిళా సమైక్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి, మున్నూరు కాపు సంఘానికి 5 లక్షల ప్రొసీడింగ్స్ అందజేశారు. అనంతరం మెట్పల్లి నుండి కోనరావుపేట, పెగ్గర్ల, రుద్రంగి మీదుగా వేములవాడకు నూతన బస్ సర్వీస్ ను ప్రారంభించారు. విప్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శం, ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం పై, కేరళ ముఖ్యమంత్రి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం పై మొదటి సంతకం చేశారని అన్నారు. రాష్ట్రంలో కుల గణన చేసిన తర్వాత నరేంద్ర మోదీ దిగి వచ్చి దేశంలో జనగణ కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం కోసం 5 లక్షలు మంజూరు చేయడంజరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు విషయంలో కుల మతాలకు, పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు, గతంలో బేస్ మెంట్, గోడలు కట్టుకుని ఉన్నా వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు కింద ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారని అన్నారు. గ్రామీణ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, మహిళా సమైక్య సంఘాల బలోపేతం ద్వారా కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని. ప్రభుత్వం అవకాశం ఉంటుందని, మహిళల స్వయం సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ, ఇటువంటి మౌలిక సదుపాయాలను అందించేందుకు కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల సంక్షేమ ధ్యేయంగా ముందుకు పోతుందని తెలిపారు. కథలాపూర్ మేడిపల్లి భీమారం మండలాల వరద ప్రదాయిని కలికోట సూరమ్మ రిజర్వాయర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఇప్పటికే కుడి ఎడమ కాలువ నిర్మాణానికి భూసేకరణ పూర్తయినట్టు తెలిపారు. కొందరు రైతు ఖాతాలో భూసేకరణ డబ్బులు మంజూరయ్యాయని సందర్భంగా గుర్తు చేశారు. గతంలో వరద కాలువ తవ్వితే అడ్డుపడిన వారే నేడు వరద కాలువ జలం మాయంగా మారింది అనడం విడ్డూరమన్నారు ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి వరద కాలువ శ్రీకారం చుట్టిన ఎస్ఆర్ఎస్పి నుండి నీరు అందిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం రాళ్లవాక నుండి వ్యవసాయానికి సాగునీటి విడుదల చేస్తున్నామని రైతులు సన్నం వరులు పండించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



## కేజీబీవీ కథలాపూర్ పాఠశాల సందర్శించిన విద్యాశాఖ అధికారులు

కథలాపూర్, జూన్ 18(విజన్ ఆంధ్ర):
మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ను విద్యాధికారులు . జి సి ఈ ఓ, నీరజ, ఏ ఎం ఓ చంద్రశేఖర్, ఎంఈఓ శ్రీనివాస్ లు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా కార్యక్రమాలు, విద్యార్థినిల సంక్షేమం, వసతులపై సమీక్ష నిర్వహించారు.అనంతరం విద్యార్థినులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, దుప్పట్లను పంపిణీ చేశారు. విద్యార్థులు విద్యపై మరింత శ్రద్ధ కనబరిచి ఉన్నత లక్ష్యాలను సాధించాలని అధికారులు సూచించారు.అధికారులు విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యాభ్యాసం, అవసరాల గురించి తెలుసుకున్నారు. పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను మరింత మెరుగుపరచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి లావణ్యతో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల పంపిణీ

## విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలే భరోసా



పోతుగల్,జూన్18(విజన్ ఆంధ్ర)
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలోని ప్రభుత్వ బాలుర మరియు బాలికల పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను కల్పించడమే కాకుండా నాణ్యమైన విద్యను అందిస్తోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలని, తమ పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలే భరోసా అని పేర్కొన్నారు.విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసిన అనంతరం వారు విద్యాభ్యాసంలో మరింత శ్రద్ధ కనబర్చి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోల కృష్ణ, ప్రధానోపాధ్యాయులు మామిండ్ల భూపతి, ఉపాధ్యాయురాలు రేష్మ, వార్డు సభ్యులు జంగ రాజు, వెంకటేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది

## "ఆచార్య రత్న" పురస్కార గ్రహీత శర్మ కు ఘన సన్మానం

కరీంనగర్ (విజన్ ఆంధ్ర) జూన్ 18..



శ్రీ చైతన్య పీజీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ నాగిళ్ల సదాశివ శర్మ ఇటీవల నెల్లూరు లో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ప్రతిష్టాత్మకమైన "ఆచార్య రత్న"పురస్కారాన్ని అందు కున్నారు.ఈ పురస్కారాన్ని అఖిల భారత జాతీయ బ్రాహ్మణ ఐక్య వేదిక అధ్యక్షుడు అవధానం సాయికుమార్ చేతులమీదుగా ప్రదానం చేశారు.ఈ సందర్భంగా విద్యా రంగానికి ఆయన అందించిన విశిష్ట సేవలను పలువురు వక్తలు కొనియాడారు.అనంతరం శర్మ కు పుష్ప గుచ్చాన్ని అందించి శాలువా తో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో ఎం. దత్తాత్రేయ శర్మ, కే. వి. ఎన్. ఆచార్య,సుబ్రహ్మణ్య శర్మ, కె. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బంద్ ఉట్టి మాటే ?



- బెల్ట్ షాపుల 'బంద్'కు గట్టి చర్యలుండవ?
- గ్రామ పాలకవర్గం ఏం చేస్తున్నట్టు?
- "బెల్ట్" విక్రయాల జోరు!
- యథేచ్ఛగా మద్యం సరఫరా

ఇల్లందకుంట జూన్ 17 (విజన్ ఆంధ్ర)
ఇల్లందకుంట మండల పరిధిలోని కనగర్తి గ్రామంలో ఈ నెల 5 నుంచి బెల్ట్ షాపులు బంద్ చేస్తున్నట్టు గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రకటించింది. దీంతో గ్రామంలో మద్యం ఏరులై పారకుండా అడ్డుకట్ట పడుతుందని మహిళలు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ బాగు కోసం గ్రామ పంచాయతీ పాలకవర్గం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమైంది. కానీ, ఆచరణలో మాత్రం 'బంద్' ఉత్త మాటేనని తేలిపోయింది.! బెల్ట్ షాపులలో యథేచ్ఛగా జోరుగా మద్యం విక్రయాలు కొనసాగుతుండటం గమనార్హం. అయితే, ఇవేవీ తమకు పట్టవన్నట్టుగానే కనగర్తి గ్రామ పంచాయతీ పాలకవర్గం ఉదాసీనంగా వ్యవహరించడంలో ఆంతర్యమేంటనే అనుమానాలూ బలంగా వ్యక్తమవుతున్నాయి. పేరుకేనా బెల్ట్ షాపుల 'బంద్'? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### 'బెల్ట్' తీసేదెవరు?

గ్రామంలోని బెల్ట్ షాపులు బంద్ టైంలోనూ దర్జాగా కొనసాగుతున్నట్లు కొందరు చెబుతున్నారు. ఊరి బాగు కోసం కట్టుబడిన గ్రామ పంచాయతీ పాలకవర్గం.. బెల్ట్ షాపుల నిర్వాహకులపైన తగు చర్యలకు ఎందుకు జంకుతున్నదో తెలియడం లేదని కనగర్తివాసులు పేర్కొంటున్నారు. పకడ్బందీగా బంద్ అమలుకు గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆ దిశగా చర్యలకు కట్టుబడి ఉందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలో యథేచ్ఛగా, జోరుగా గతానికి మించిన రీతిలో మద్యం ఏరులై పారుతున్నదని, మందుబాబులు మద్యంలో తూగుతున్నారనే వాదనలూ ఉన్నాయి. పేరుకు 'బెల్ట్ షాపుల బంద్' అని చెబుతూ.. తెరవెనక బెల్ట్ షాపుల విస్తరణకు ప్లాన్ చేశారా? అనే అనుమానాలూ వస్తున్నాయని కొందరు అంటున్నారు. దొరికింది సమయం అన్నట్టుగా.. ఈ సందర్భంలోనే 'బెల్ట్' షాపుల నిర్వాహకులు మద్యం బాటిళ్ల విక్రయాల సందర్భంగా రూ.50 అదనంగా వసూలు చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారని మందుబాబులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మునుపెన్నడు లేని రీతిలో ఇప్పుడే గ్రామంలో బెల్ట్ షాపులు కొనసాతున్నాయని పేరు చెప్పడానికి ఇష్టపడని కొందరు వెల్లడిస్తున్నారు. 'బెల్ట్' షాపుల నిర్వాహకులపైన కఠిన చర్యలుండేలా పాలకవర్గం తగు చర్యలు తీసుకోవాలని, తద్వారా మాత్రమే గ్రామంలో ప్రజల బాగు కోసం బెల్ట్ షాపులు మూతబడుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు

# టాస్క్‌ఫోర్స్ పోలీసుల మెరుపు దాడి..!



- 2 అక్రమ ఇసుక డంపులు సీజ్
- 50 ట్రాక్టర్ల లోడుల ఇసుక స్వాధీనం
- అక్రమ ఇసుక మాఫియాపై ?

ఉక్కుపాదం మోపుతున్న పోలీసులు : సీపీ గౌష్ ఆలం

కరీంనగర్ జూన్ 18, విజన్ ఆంధ్ర :
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, నిల్వలను అరికట్టేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈరోజు ఉదయం కొత్తపల్లి మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాజీపూర్ గ్రామ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన 2 భారీ ఇసుక డంపులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించి, సీజ్ చేశారు. సీజ్ చేసిన ఈ రెండు డంపుల్లో మొత్తం 50 ట్రాక్టర్ల లోడుల ఇసుక ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న ఇసుక నిల్వలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తవ్వడం, నిల్వ చేయడం, రవాణా చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాపై జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై మైనింగ్ చట్టాలు, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు



## ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలి

### - బీ.ఎల్.ఓ.లు విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలి

### జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

మల్లాపూర్, జూన్ 18 (విజన్ ఆంధ్ర):

ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను బిఎల్ఓ లు సమర్ధ సమర్ధవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అన్నారు. గురువారం ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ బీ.ఎల్.ఓ.లకు శిక్షణ కార్యక్రమం గురువారం మల్లాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర పునర్విమర్శ ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన బూత్ స్థాయి అధికారుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర పునర్విమర్శ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని సూచించారు. ఇంటింటి సర్వే సందర్భంగా ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఓటర్ల నుంచి వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించాలని, ఓటరు జాబితాల నాణ్యతను మెరుగుపరచడంలో బీఎల్ఓలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావు లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రజలకు అవసరమైన సమాచారం అందిస్తూ ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని పెంపొందించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్, ఎంపిడివో, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## చిక్కాల అశ్విన్ రావుకు నివాళులర్పించిన కేటీఆర్, హరీష్ రావు



రాజన్న సిరిసిల్ల, జూన్ 18 (విజన్ ఆంధ్ర):

రాజన్న సిరిసిల్ల జిల్లా సెస్ చైర్మన్ చిక్కాల రామారావు కుమారుడు స్వర్గీయ చిక్కాల అశ్విన్ రావు ద్వాదశ దినకర్మ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్గీయ అశ్విన్ రావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చిక్కాల రామారావు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి ప్రగాఢ దుఃఖంలో భాగస్వాములై ధైర్యం చెప్పారు.అశ్విన్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన కేటీఆర్, హరీష్ రావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

## ఉపాధ్యాయులు తమ పిల్లల్ని తాము పనిచేసే పాఠశాలలోనే చేర్పించడం శుభపరిణామం




### - జిల్లా విద్యాశాఖాధికారి రాము

మల్లాపూర్, జూన్ 18 (విజన్ ఆంధ్ర):

ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల పిల్లలను చేర్పించడం శుభ పరిణామం అని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లను ఆకస్మికంగా తనిఖీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, గత విద్యా సంవత్సరంలో మండల విద్యాశాఖ మంచి ప్రణాళిక,సమన్వయంతో పనిచేసి విద్యార్థులకు అత్యుత్తమ బోధనతో మంచి ఫలితాలు సాధించినందుకు అభినందించారు. ఇదే స్ఫూర్తితో ప్రస్తుత విద్యా సంవత్సరంలో కూడా అధిక సంఖ్యలో విద్యార్థుల నమోదు చేపట్టి, నాణ్యమైన విద్య అందించి మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మల్లాపూర్‌లో పనిచేస్తున్న స్రవంతి అనే ఉపాధ్యాయురాలు తన ఇద్దరు పిల్లలను మూడవ తరగతి, ఐదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినందుకు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయులు తమ పిల్లలను తాము పనిచేసే ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించడం ప్రభుత్వ విద్యపై విశ్వాసాన్ని పెంపొందించే శుభపరిణామమని పేర్కొంటూ, ఇదే స్ఫూర్తిని ఇతర ఉపాధ్యాయులు కూడా కొనసాగించాలని కోరారు.అనంతరం కేజీబీవీ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత, పరిశుభ్రత తదితర అంశాలపై విచారించి వంట సిబ్బందికి, అలాగే ప్రత్యేక అధికారి శ్రీలత కు తగిన సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కేతిరి దామోదర్ రెడ్డి, మల్లాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమోహన్ రెడ్డి, రాజేందర్, కేజీబీవీ ఎస్.ఓ. శ్రీలత, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై లైంగిక వేధింపులు..తండ్రికి 4 ఏళ్ల జైలు శిక్ష

రాజన్న సిరిసిల్ల, జూన్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో):

మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో నిందితుడైన తండ్రికి నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాధికా జైస్వాల్ గురువారం తీర్పు వెలువరించారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.జిల్లాలోని ఓ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో బాధిత బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడంతో పాటు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.విచారణ సందర్భంగా అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ బృందం సమన్వయంతో ఎనిమిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజనీకాంత్ వాదనలు వినిపించగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నేరం రుజువైనట్లు నిర్ధారించి నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధించింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నేరం చేసిన ఎవరూ శిక్ష నుంచి తప్పించుకోలేరని, పోలీసులు, ప్రాసిక్యూషన్ సమన్వయంతో పకడ్బందీగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు మానిటరింగ్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, సంబంధిత సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

## కోరుట్లపేటలో 11 సీసీ కెమెరాల ప్రారంభం..

### డ్రగ్స్ నిర్మూలన, రోడ్డు భద్రతపై ఎస్పీ అవగాహన

ఎల్లారెడ్డి పేట , జూన్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో):

జిల్లాలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రతకు సాంకేతికతను మరింత విస్తరిస్తూ ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామంలో "నేను సైతం" కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన 11 సీసీ కెమెరాలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో నిర్వహించిన అవగాహన సమావేశంలో సీసీ కెమెరాల ప్రాధాన్యత, డ్రగ్స్ నిర్మూలన, గంజాయి వంటి మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, రోడ్డు భద్రతా నియమాలపై ఎస్పీ అవగాహన కల్పించారు. అనంతరం డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.ఎస్పీ మాట్లాడుతూ, "నేను సైతం" కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు స్వచ్ఛందంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. ఆధునిక సాంకేతికతతో నేరాలను అరికట్టడంలో, నిందితులను వేగంగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించిందని ఎస్పీ పేర్కొన్నారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రజల సహకారం అవసరమని, ఎక్కడైనా డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగం గురించి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, అతివేగం, రాంగ్ రూట్ ప్రయాణాలకు దూరంగా ఉండాలని చెప్పారు. "అరైవ్ అలైవ్" కార్యక్రమం ద్వారా జిల్లావ్యాప్తంగా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కోరుట్లపేట గ్రామంలో ఇప్పటివరకు రోడ్డు ప్రమాదాలు జరగకపోవడం గ్రామ ప్రజల చైతన్యానికి నిదర్శనమని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేష్, ఎస్ఐ రాహుల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ జ్యోతి, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు






# మహిళల భద్రతే లక్ష్యం..

### పని ప్రదేశాల్లో షీ టీమ్ అవగాహన కార్యక్రమాలు

రాజన్న సిరిసిల్ల, జూన్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో): జిల్లాలో మహిళల భద్రతకు మరింత ప్రాధాన్యత ఇస్తూ, వారు ఎలాంటి వేధింపులు ఎదుర్కొన్నా నిర్భయంగా ఫిర్యాదు చేయాలని జిల్లా షీ టీమ్ పిలుపునిచ్చింది. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా మహిళలు పనిచేసే ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, పని ప్రదేశాల్లో భద్రతా చర్యలు, మహిళలకు ఉన్న చట్టపరమైన హక్కులు, రక్షణ కోసం అందుబాటులో ఉన్న సేవలపై అవగాహన కల్పిస్తున్నారు.గురువారం గంభీరావుపేట మండలంలోని ముచ్చెర్ల, లింగన్నపేట గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న మహిళలకు ప్రత్యేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. వేధింపులు, బెదిరింపులు లేదా ఇతర సమస్యలు ఎదురైన వెంటనే జిల్లా షీ టీమ్ హెల్ప్‌లైన్ 87126 56425కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.ఫిర్యాదు అందిన వెంటనే నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదు చేసిన మహిళ వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని షీ టీమ్ అధికారులు హామీ ఇచ్చారు.సోషల్ మీడియాలో అపరిచితులతో పరిచయాలు పెంచుకోవద్దని, వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, ఇతర వివరాలను తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని మహిళలకు సూచించారు.ఈ అవగాహన కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐలు ప్రమీల, రవి, సిబ్బంది శ్రీనివాస్, ప్రియాంక, శ్రీలత పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే డెంగ్యూ, మలేరియా నియంత్రణ సాధ్యం

### మండల వైద్యాధికారి డా. ఎల్లాల అంజిత్ రెడ్డి



మెట్ పల్లి జూన్ 18 (విజన్ ఆంధ్ర): మెట్‌పల్లి మండలంలో వెక్టర్ జనిత వ్యాధుల నివారణపై సమన్వయ సమావేశం నిర్వహణ.మెట్‌పల్లి మండలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వెక్టర్ జనిత వ్యాధుల నివారణ, నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి మండల వైద్యాధికారి డా. అల్లాల అంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించబడింది.ఈ సమావేశంలో ఎంపీడీఓ శ్రీ రామకృష్ణ, ఎంపీఓ శ్రీ ప్రదీప్, సబ్ యూనిట్ అధికారి విలాయత్ బేగ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీ రమేష్, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.సమావేశంలో గ్రామాలు మరియు పట్టణ ప్రాంతాల్లో దోమల పెరుగుదలకు అనుకూలంగా ఉన్న నిల్వ నీటి వనరులను గుర్తించి వెంటనే తొలగించాలని సూచించారు. ప్రతి శుక్రవారం "డ్రై డే" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.డా. అంజిత్ రెడ్డి మాట్లాడుతూ, డెంగ్యూ నివారణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని, జ్వరం లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వేలు నిర్వహించి జ్వర బాధితులను గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎంపీడీఓ శ్రీ రామకృష్ణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు పారిశుద్ధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించి, చెత్త తొలగింపు, మురుగు కాలువల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎంపీఓ శ్రీ ప్రదీప్ గ్రామస్థాయిలో ప్రజలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.అనంతరం వెక్టర్ జనిత వ్యాధుల నివారణకు సంబంధించి వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి మండలాన్ని వ్యాధి రహితంగా ఉంచేందుకు కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు

# లింగంపేటలో అక్షరాభ్యాసం

### పుస్తకాలు -- నోటుబుక్కుల పంపిణీ కార్యక్రమం



వేములవాడ ఆర్ సి జూన్ 18 (విజన్ ఆంధ్ర) లింగంపేట గ్రామ ప్రాథమిక పాఠశాలలో నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని అక్షరాభ్యాస కార్యక్రమం మరియు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి వారి విద్యాభ్యాసానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పలు సౌకర్యాలను అందిస్తున్నందున గ్రామ ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. సర్పంచ్ కొక్కుల నరేష్, ఉపసర్పంచ్ ఆకుల ఎల్లయ్య, హై స్కూల్ హెడ్మాస్టర్ ఉమారాణి, ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ సంజీవ్ నేదురి, ఉపాధ్యాయులు గణేష్, అంగన్వాడి టీచర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని మునిసిపల్ కార్యాలయ సిబ్బంది.

### పట్టించుకోని అధికారులు



మెట్ పల్లి జూన్ 18 (విజన్ ఆంధ్ర): మెట్ పల్లి మున్సిపల్ అధికారులతీరు ఉన్నత అధికారులు హెచ్చరించిన మారడం లేదు అని విమర్శలువినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ఇంజనీరింగ్ సెక్షన్ సిబ్బంది మేం అధికారులు మాకు నచ్చినప్పుడు కార్యానికి వస్తాం నచ్చినప్పుడు కార్యాలయం నుంచి వెళ్తాం అనే రీతిగా తయారయింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అంతా మా ఇష్టం కార్యాలయానికి ఎప్పుడ యినా వస్తాం. ఎప్పుడయినా వెళ్తా ము అనే తీరుగా తయారైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మెట్టుపల్లి మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహించే సిబ్బంది కొందరు11 గంటలు దాటినావిధులకు హాజరు కాకపోవడం తో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం10.00 గంటలకు వచ్చి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాల్సిన ఉద్యోగులు ఉదయం 11 దాటినా కార్యాలయానికి రావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నత అధికారులు మెట్టుపల్లి మున్సిపల్ కార్యాలయం పై దృష్టి సారించి గాడితప్పిన అధికారులను గాడిలో పెట్టి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనకుండా అధికారులపై చర్యలు తీసుకొనవలసిందిగా పట్టణ ప్రజలు కోరుతున్నారు, ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారో. లేదు వేచి చూడాల్సిందే

# అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నదాత సుఖీభవ

### అన్నపూర్ణ స్వచ్ఛంధ సేవ సంస్థ ఆధ్వర్యంలో

### 725వ రోజు అన్నదానం ..మానవ సేవే మాధవ సేవ





వేములవాడ జూన్ 18 (విజన్ ఆంధ్ర ) ప్రసిద్ధ పుణ్యక్షేత్రం దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిత్యం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా 725వ రోజు సందర్భంగా సాయి అనీష్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని వారి అమ్మమ్మ తాతయ్య అందించిన సహాయంతో మరియు శాశ్వత దాతలు నాగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు(భాను ఏజెన్సీస్)వారి మరియు సంవత్సర దాతలు తోట లక్ష్మి, కూరగాయల మధు మమత దంపతుల, సహకారాలతో ఈ రోజు వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఉన్న మరియు పట్టణ పరిసర ప్రాంతాలలో ఉన్న అన్నార్థులకు యాచకులకు భోజనం ప్యాకెట్లు అందించడం జరిగిందని అన్నపూర్ణ స్వచ్ఛంధ సేవ సంస్థ నిర్వాహకులు తోట లహరి అన్నారు, అనంతరం వారు మాట్లాడుతూ ట్రస్ట్ తరుపున నిర్వహిస్తున్న సేవ కార్యక్రమాలకు గానూ మీ వంతు సహాయ సహకారాలు అందించాలనుకునేవారు ట్రస్టు నెంబర్ 8919376459,ను సంప్రదించాల్సిందిగా కోరారు, ఇట్టి సేవ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తోట లహరి రాజేష్, తదితరులు పాల్గొన్నారు

## ఓదెలలో బిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడి ముందస్తు అరెస్ట్.




ఓదెల జూన్ 18,(విజన్ ఆంధ్ర) బీఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడికి పిలుపు నిచ్చారు.ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడిలో భాగంగా గురువారం ఉదయం తెల్లవారు జామున పొత్కపల్లి పోలీసులు బిఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు మ్యాదగోని శ్రీకాంత్ గౌడ్ ను ముందస్తు అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా మ్యాదగోని శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం ముట్టడి నేపథ్యంలో ఉదయం అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు.ఎవరైనా స్వేచ్ఛగా తమ నిరసనలు తెలుపవచ్చు అన్న సీఎం రేవంత్ రెడ్డి మాటలు,మాటల వరకే పరిమితం అయ్యాయని ఇలాంటి అక్రమ అరెస్టుల ద్వారా ప్రజా వ్యతిరేకతల నుండి ప్రభుత్వం తప్పించుకోలేదని విద్యార్థి విభాగం నుండి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నమన్నారు.అక్రమ అరెస్టుల ద్వారా ప్రభుత్వాన్ని ఎన్నో రోజులు నడపలేరని,ప్రభుత్వం ఇకనైనా మేల్కొని విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేసి 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పోలీస్ కానిస్టేబుల్ విభాగంలో 20 వేల ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని డీజిపి చెప్పారని, ముఖ్యమంత్రి కేవలం 5 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని నోటిఫికేషన్ ఇవ్వడన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే 20వేల ఉద్యోగాలు భర్తీ చేసి తెలంగాణలోని నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.లేకుంటే తెలంగాణవ్యాప్తంగా విద్యార్థులం యువకులం కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు



# వ్యక్తి కాదు..మానవతా మూర్తి

### అభయాంజనేయ స్వామిపై అపార భక్తి

### దేవాలయాల అభివృద్ధే ధర్మ పరిరక్షణ హరీష్ రెడ్డి

పెద్దపల్లి బ్యూరో చీఫ్, (విజన్ ఆంధ్ర):
సమాజ సేవతో పాటు ఆధ్యాత్మిక చైతన్యానికి అండగా నిలుస్తూ ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. జనగామ గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధి పనుల కోసం ఆలయ కమిటీ అధ్యక్షులు నడిపెల్లి గోపాలరావు, జనగామ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్యామల ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన హరీష్ రెడ్డి రూ.30 వేల ఆర్థిక విరాళాన్ని బుధవారం అందజేశారు. దేవాలయాల అభివృద్ధి అంటే కేవలం నిర్మాణ పనులు మాత్రమే కాదని, భక్తి, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు అది బలమైన పునాది అని ఆయన తెలిపారు. ఆధ్యాత్మిక కేంద్రాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు యువతకు మంచి విలువలను అందిస్తాయని అన్నారు. శ్రీ పాటి అభయాంజనేయ స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు నీలం సంజీవ్ పటేల్, ఆరేళ్ల రవితేజ, పోలాడి శ్రీనివాసరావు తదితరులు హరీష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయన సేవా భావం యువతకు ఆదర్శమని కొనియాడారు. దేవాలయ అభివృద్ధికి స్థానిక ప్రజలు, దాతలు మరింతగా ముందుకు రావాలని వారు విజ్ఞప్తి చేశారు

## మెడికవర్‌లో అత్యాధునిక మినిమల్లీ ఇన్వాసివ్ గుండె శస్త్రచికిత్స...

### - కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ రవికుమార్



కరీంనగర్. (విజన్ ఆంధ్ర)
.మెట్రో నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండే అత్యాధునిక మినిమల్లీ ఇన్వాసివ్ కార్డియోవా స్క్యులర్ సర్జరీని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందం విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ రవికుమార్ వెల్లడించారు. బుధవారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కొంతకాలంగా ఛాతినొప్పి, తీవ్రమైన ఆయాసం, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న జగిత్యాలకు చెందిన 54 ఏళ్ల మాధవి చికిత్స కోసం మెడికవర్ ఆసుపత్రికి రాగా, వైద్య పరీక్షల్లో ఆమె గుండెలోని ప్రధాన మైట్రల్ వాల్వ్ మూసుకుపోయినట్లు గుర్తించామన్నారు. సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో ఓపెన్ హార్ట్ సర్జరీ నిర్వహిస్తారని, అయితే ఆ పద్ధతిలో రోగి కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుందని వివరించారు. రోగి ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఛాతి కింది భాగంలో చిన్న గాటు ద్వారా మినిమల్లీ ఇన్వాసివ్ పద్ధతిలో మైట్రల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం మాధవి పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. అత్యాధునిక వైద్యసేవలను సైతం ఆరోగ్యశ్రీ పరిధిలో అందించి, కొత్త జీవితం ప్రసాదించిన మెడికవర్ వైద్య బృందానికి రోగి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ విలేకరుల సమావేశంలో కార్డియాలజిస్టులు డాక్టర్ అనీష్ పబ్బ, డాక్టర్ వాసుదేవరెడ్డి, అనెస్థీషియా డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# చెత్త వేస్తే చలానా.. ఆక్రమిస్తే కూల్చివేత






- పరిశుభ్రతపై నగర పాలక సంస్థ ఉక్కుపాదం
- స్వచ్ఛ రామగుండం కోసం కఠిన చర్యలు
- ఫొటో తీస్తారు... ఫైన్ వేస్తారు
- రామగుండం మేయర్ మహంకాళి స్వామి

పెద్దపల్లి బ్యూరో చీఫ్, (విజన్ ఆంధ్ర)
రామగుండం నగరాన్ని పరిశుభ్రంగా, వరదల రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నగర పాలక సంస్థ కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఇకపై రోడ్లు, కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో చెత్త పారబోసే వారిపై ఉక్కుపాదం మోపాలని మేయర్ మహంకాళి స్వామి అధికారులను ఆదేశించారు. బుధవారం ఇందిరానగర్‌లో నిర్వహించిన ప్రత్యేక పర్యటనలో మేయర్ స్వయంగా ప్రజలకు హెచ్చరిక జారీ చేస్తూ, చెత్త వేస్తూ పట్టుబడిన వారిపై అక్కడికక్కడే జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. నగర పరిశుభ్రతకు ఆటంకంగా మారిన ఆక్రమణలను ఉపేక్షించబోమని, ప్రజల భద్రత, సౌకర్యాల కోసం అవసరమైతే కూల్చివేత చర్యలు కూడా చేపడతామని పేర్కొన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు వేగవంతం చేసి వరద ముప్పును తగ్గిస్తున్నామని వెల్లడించారు. ఆర్ఎఫ్సీఎల్ నీటి ప్రవాహం వల్ల ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న ఇందిరానగర్ ప్రజలకు శాశ్వత పరిష్కారం అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇళ్ల ముందు, రోడ్లపై, కాలువలపై నిర్మించిన అక్రమ కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించాలని ప్రజలకు సూచించారు. ప్రతి కాలనీ చివరి ఇంటి వరకు మౌలిక వసతులు చేరేలా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు సులభంగా వెళ్లేందుకు వీధులను విస్తరించే కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఇదే సమయంలో మద్యం దుకాణం ఎదుట రోడ్డును ఆక్రమించిన నిర్మాణాన్ని అధికారులు తొలగించగా, కాలువలో ఖాళీ సీసాలు పారబోసిన దుకాణ యజమానిపై భారీ జరిమానా విధించేందుకు చర్యలు ప్రారంభించారు. పరిశుభ్రత విషయంలో ఎవరిపట్లా రాజీ ఉండదని, శిక్షలతో పాటు అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో బాధ్యత పెంచుతామని కమిషనర్ అరుణ శ్రీ తెలిపారు. స్వచ్ఛమైన, సుందరమైన, సురక్షితమైన రామగుండం నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని మేయర్ మహంకాళి స్వామి పిలుపునిచ్చారు

# ఆర్టీసీ డిపో, రైల్వే స్టేషన్‌కు సీఎస్ఆర్ కానుకలు



### ప్రయాణికుల సౌకర్యాల కోసం ఎన్టీపీసీ చేయూత
### సామాజిక బాధ్యతలో మరో ముందడుగు
### వాటర్ కూలర్లు, బెంచీలతో ప్రజలకు ఉపశమనం
### ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఎన్టీపీసీ కార్యక్రమాలు

పెద్దపల్లి బ్యూరో చీఫ్, (విజన్ ఆంధ్ర):
రామగుండం ప్రాంత ప్రజల సౌకర్యాల అభివృద్ధికి ఎన్టీపీసీ రామగుండం మరోసారి తన సామాజిక బాధ్యతను చాటుకుంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా ప్రజా రవాణా కేంద్రాల్లో ప్రయాణికుల కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను అందజేసింది. ఈ మేరకు బుధవారం గోదావరిఖని ఆర్టీసీ డిపోకు స్టెయిన్లెస్ స్టీల్ మూడు సీట్ల బెంచీలు, చల్లని తాగునీటి కోసం వాటర్ కూలర్లను అందించి ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించింది. ఇదే తరహాలో రామగుండం రైల్వే స్టేషన్‌కు నాలుగు స్టెయిన్లెస్ స్టీల్ మూడు సీట్ల బెంచీలు, వాటర్ కూలర్లను అందజేసి రైల్వే ప్రయాణికుల అవసరాలను తీర్చేందుకు సహకరించింది. ప్రజలు ఎక్కువగా వినియోగించే ఈ రెండు కీలక రవాణా కేంద్రాల్లో సౌకర్యాల పెంపుతో వేలాది మంది ప్రయాణికులు లబ్ధి పొందనున్నారు. ప్రయాణికులు వేచి ఉండే సమయంలో సౌకర్యంగా కూర్చునేందుకు, స్వచ్ఛమైన చల్లని తాగునీరు అందుబాటులో ఉండేందుకు ఈ ఏర్పాట్లు ఉపయోగపడనున్నాయి. ఈ సామగ్రి అందజేత కార్యక్రమాల్లో ఎన్టీపీసీ రామగుండం, టీఎస్ఆర్టీసీ, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాంతీయ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల మెరుగుదల లక్ష్యంగా ఎన్టీపీసీ చేపడుతున్న సీఎస్ఆర్ కార్యక్రమాలు వివరాలను సంబంధిత అధికారులు వివరించారు. ఈ కార్యక్రమాలపై ఎన్టీపీసీ సంస్థ స్థానిక ప్రజల ప్రశంసలు అందుకుంటున్నది. సమాజాభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తూ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ఎన్టీపీసీ రామగుండం నిరంతరం కృషి చేస్తోందని అధికారులు తెలిపారు





## కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### ఓబీసీ మోర్చా నాయకులు అడిచర్ల రాజు, ఆకుల రాజేందర్

కరీంనగర్ (విజన్ ఆంధ్ర)మానకొండూరు, జూన్ 18:.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ తీసుకెళ్లాలని, తద్వారా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అడిచర్ల రాజు, జిల్లా కన్వీనర్ ఆకుల రాజేందర్ పిలుపునిచ్చారు.ప్రధాని నరేంద్ర మోడీ పాలన 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, 'జనకల్యాణ్' కార్యక్రమంలో భాగంగా మానకొండూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన వృత్తి కళాకారులకు, ఓబీసీలకు ఈ పథకం ఒక వరం లాంటిదని, దీనిని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని సూచించారు. ఓబీసీ వర్గాలకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వారి అభివృద్ధికి ఎన్నో అవకాశాలు కల్పిస్తోందని పేర్కొన్నారు.పర్యావరణం –ప్రకృతి వ్యవసాయం పై దృష్టి సారించాలని , రాబోయే పక్షం రోజుల పాటు చెట్లు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని, అలాగే ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులకు కలిగే లాభాలపై అవగాహన కల్పించాలని నాయకులు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా అసెంబ్లీ ప్రబారి మియాపూర్ లక్ష్మాచారి, మండల కన్వీనర్లు గోరిశెట్టి రమేష్, అంబటి స్వామి, వెంగల ప్రవీణ్, నెట్టు అంజయ్యలతో పాటు బీజేపీ నాయకులు దూలం కిరణ్, టంగుడు రాజ్ కుమార్, విష్ణువర్ధన్, నందగిరి బలరాం, పుట్టాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారుద

## 54వ డివిజన్‌లో ఘనంగా 'బడిబాట'

### పాల్గొన్న కార్పొరేటర్ జి. ఉమారాణి



కరీంనగర్. (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 18..

.కరీంనగర్ నగరంలోని 54వ డివిజన్ పరిధిలో గల అంగన్‌వాడీ స్కూల్‌లో మంగళవారం 'బడిబాట' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ప్రభుత్వ బడులలో చేరికలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక డివిజన్ కార్పొరేటర్ జి. ఉమారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్ల లోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో మేలు చేస్తాయని, ఇక్కడ అందించే పౌష్టికాహారం, ప్రాథమిక విద్య పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని అన్నారు. అర్హులైన పిల్లలందరినీ తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి, ఆయా, మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. బడిబాటలో భాగంగా చిన్నారులకు అంగన్‌వాడీ సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు

## గుడిసెలు లేని గ్రామాలే సర్కారు లక్ష్యం : ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



;మానకొండూరు జూన్18. విజన్ ఆంధ్ర

పూరి గుడిసెలు లేని గ్రామాలుగా పంచాయతీలను తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం ఎల్ఎండీ కాలనీలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం(ప్రజాభవన్)లో తిమ్మాపూర్, మానకొండూర్, గన్నేరువరం మండలాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధాదారులకు మంజూరు పత్రాలను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో పూరి గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న నివాసాలు లేకుండా పంచాయతీలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా ఇళ్ల మంజూరు జరుగుతోందని, లబ్ధిదారులు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్షకు తావు లేదని, అందరినీ అక్కున చేర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భద్రత, ఆత్మవిశ్వాసం, సామాజిక గౌరవాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం లేదని, ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేమని తప్పుకుంటే వాటిని అర్హులైన మిగితా వారికి మంజూరు చేస్తామన్నారు. ఈ మూడు మండలాల్లో మొదటి విడుతలో మంజూరై ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులను తొలగిస్తూ మిగితా అర్హులకు ఇప్పుడు ఇస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. త్వరలోనే రెండో విడుత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా వెల్లడవుతుందని ఆయన చెప్పారు. ఇళ్లు రాలేదని ఎవరూ చింతించవద్దని, అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని డాక్టర్ కవ్వంపల్లి చెప్పారు.ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్, గన్నేరువరం, మానకొండూర్ ఎంపీడీవోలు మల్హోత్రా, శ్రీనివాస్ రెడ్డి, వీవీ వరలక్ష్మి, తిమ్మాపూర్ తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బండారి రమేశ్, బొడ్డు సునిల్,మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, పార్టీ నాయకులు మోరపల్లి రమణారెడ్డి, ముస్కు ఉపేందర్ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, చింతల లక్ష్మారెడ్డి, గొట్టెముక్కుల సంపత్ రెడ్డి, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి,మాతంగి అనిల్, బుర్ర తిరుపతి గౌడ్, పొన్నాల సంపత్, కె.ఎల్లారెడ్డితోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ గ్రామశాఖల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## డీర్ పార్కులో ఘనంగా వన మహోత్సవం



### మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, మేయర్, నగరపాలక సంస్థ కమిషనర్

కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 18.

.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపుమేరకు కరీంనగర్ నగరంలోని డీర్ పార్కులో బుధవారం సాయంత్రం ఘనంగా వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు పలువురు అధికారులు మొక్కలు నాటారు. రాష్ట్ర ప్రభుత్వం, అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, మహిళలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, భావితరాలకు పచ్చని తెలంగాణను అందించాలంటే మొక్కల పెంపకాన్ని ప్రజా ఉద్యమంగా చేపట్టాలని అధికారులు పిలుపునిచ్చారు.అనంతరం హైదరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగాన్ని డీర్ పార్కులో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, అధికారులు తిలకించారు. అంతకుముందు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ముఖ్యమంత్రి సభను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షర్మిల, మెప్మా పీడీ స్వరూపారాణి, డీఆర్‌డీఓ గీత, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, కరీంనగర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్ హుస్సేన్, స్ట్రైక్ ఫోర్స్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్ అలీతో పాటు పలువురు అటవీశాఖ అధికారులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



# దొర గారి మెప్పు కోసమే కొప్పుల, ఆర్ఎస్పీ ఆరాటం

●కేసీఆర్ అవమానించినప్పుడు దళితుడిగా కొప్పులకు అండగా నిలిచిన..

●దోచుకోవడం బీఆర్ఎస్ పార్టీకి పెటెంట్ హక్కు..

కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు జీవన్ రెడ్డి వాట ఎంతో చెప్పాలి..

●రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..



కరీంనగర్. (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 18..:

కరీంనగర్ లో మంత్రి మాట్లాడుతూ.హరీష్ రావు దొర మెప్పు పొందడానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శిగా ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో దొరలు అవమానించినప్పుడు కొప్పుల ఈశ్వర్ కు సాటి దళితుడిగా అండగా నిలిచానని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. దోచుకోవడం దాచుకోవడం బీఆర్ఎస్ పార్టీకి పెటెంట్ హక్కు అని, కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో జీవన్ రెడ్డికి వచ్చిన వడ్ల కమీషన్ ఎంతో చెప్పాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిధి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ఏడాది క్రితం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రిగా తాను బాధ్యతలు తీసుకున్నానని మంత్రి అడ్లూరి అన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పని చేశారని, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకుల పాఠశాల కార్యదర్శిగా పని చేశారని ఏడాది కాలంగా ఎందుకు ఆయా శాఖలపై మాట్లాడలేదని మంత్రి అడ్లూరి ప్రశ్నించారు. సంక్షేమ శాఖలో రూ. 2వేల కోట్ల అవినీతి జరిగిందని హరీష్ రావు ఆరోపిస్తే ఆశాఖ మంత్రిగా జవాబు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని మంత్రి అడ్లూరి అన్నారు. సంక్షేమ శాఖకు సంబంధించి విద్యార్థులకు కావాల్సిన వస్తువుల కొనుగోలుకు రూ. 683 కోట్లతో టెండర్లు పిలిచామని, రూ. 500 కోట్లతో ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం టెండర్ల ఖారారు చేశామని మంత్రి అడ్లూరి తెలిపారు.మొత్తం రూ. 1183 కోట్లకు టెండర్లు పిలిస్తే మాజీ మంత్రి హరీష్ రావు రూ. 2వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపిస్తే ఆశాఖ మంత్రిగా జవాబు చెప్పానని మంత్రి అడ్లూరి అన్నారు. తాను జవాబు చెప్పితే దొరగారి మెప్పు కోసం కొప్పుల ఈశ్వర్ ఖాబ్దార్ అని మాట్లాడుతున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొప్పుల ఈశ్వర్ కు అవమానం జరిగితే తాను సాటి దళితుడిగా ఆరోజు ప్రతిపక్షంలో ఉండి అండగా నిలిచానని మంత్రి అడ్లూరి అన్నారు. 2018 ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్ ఏలా గెలిచాడో తెలంగాణ ప్రజలందరికి తెలుసని అన్నారు. కొప్పుల మంత్రిగా ఉన్న సమయంలో ఈవీఎంలు భద్రపరిచిన స్టాంగ్ రూం తాళం పోతే ఎక్కడ పోయిందని అడిగితే మంత్రి ఉన్న కొప్పుల ఈశ్వర్ సమాధానం చెప్పాలేదని మంత్రి అడ్లూరి అన్నారు. కొప్పులపై తాను 2009లో పోటీ చేస్తే కేవలం1165ఓట్ల తేడాతో ఓడిపోయానని, 2014లో 16వేల మోజార్టీతో ఓడిపోయానని, తెలంగాణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు పోటీ చేసిన సమయంలో రాష్ట్రంలో ఎవ్వరికి డిపాజిట్ రాలేదని తనకు మాత్రమే డిపాజిట్ వచ్చిందని మంత్రి అడ్లూరి గుర్తు చేశారు. ధర్మపురి ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన కొప్పుల ఈశ్వర్ నియోజకవర్గానికి ఏమీ చేయలేదని మంత్రి అడ్లూరి అన్నారు. ధర్మపురికి డిగ్రీ కళాశాల, రెవెన్యూ డివిజన్, ఆర్టీసీ బస్సు డిపో ఏమీ తీసుకురాకపోవడంతోనే 2023 ఎన్నికల్లో ఈశ్వర్ కు ప్రజలు బుద్ధి చెప్పారని మంత్రి అడ్లూరి అన్నారు. 2024 పార్లమెంట్ఎన్నికల్లో సైతం ధర్మపురి నియోజకవర్గ ఓటర్లు కొప్పులకు ఓట్లే వేయలేదని మంత్రి అడ్లూరి తెలిపారు.దోచుకోవడం దాచుకోవడం బీఆర్ఎస్ పార్టీకి పెటెంట్ హక్కు అని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గతంలో సంక్షేమ శాఖ మంత్రిగాఉన్న కొప్పుల, గురుకుల కార్యదర్శిగా ఉన్న ప్రవీణ్ కుమార్ కలిసి దోచుకున్నారు కనుక ఇప్పుడు ఇలా మాట్లాడుతున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పారదర్శకంగా పని చేస్తుందని మంత్రి పేర్కొన్నారు.

### జీవన్ రెడ్డి వాటాఎంతో చెప్పాలి..

కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి వడ్ల కొనుగోలులో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్నారని, జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సీజన్లలో వడ్లు కొనుగోలు చేసిందని, మరి అప్పుడు జీవన్ రెడ్డి గారికి ఎంత కమీషన్ వచ్చిందో చెప్పాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

# రూ.2,000 కోట్ల టెండర్లపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్

### కరీంనగర్‌లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కరీంనగర్ బ్యూరో (విజన్ ఆంధ్ర) జూన్ 18.

కరీంనగర్ పట్టణంలోని హోటల్ తారక్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొప్పుల ఈశ్వర్ గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, సర్దార్ రవీందర్ సింగ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఓరుగంటి రమణారావు, పీఏసీఎస్ చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, బూట్లు, టైలు, ప్లేట్లు తదితర వస్తువుల సరఫరా కోసం దాదాపు రూ.2,000 కోట్ల విలువైన టెండర్లు పిలిచిందని తెలిపారు. ఈ టెండర్ల ప్రక్రియ ముందుగానే ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేసి నిర్వహించినట్లు కనిపిస్తోందని ఆరోపించారు.ఈ టెండర్లలో భారీ అవినీతి జరిగిందని బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆధారాలతో ఆరోపించారని గుర్తుచేస్తూ, వాటిపై ప్రభుత్వం, సంబంధిత మంత్రులు మరియు ముఖ్యమంత్రి ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతిపక్షాలు మాత్రమే కాకుండా సామాన్య ప్రజలు ప్రశ్నించినా సమాధానం చెప్పడం ప్రభుత్వ కనీస బాధ్యత అని పేర్కొన్నారు.ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే ఈ టెండర్ల వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లేదా రిటైర్డ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అవినీతి జరగలేదని ప్రభుత్వం భావిస్తే శ్వేతపత్రం విడుదల చేయాలని లేదా అసెంబ్లీలో చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు.గతంలో టెండర్ల ద్వారా స్థానిక చిన్న సంస్థలు, కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ఎంఎస్ఎంఈలకు అవకాశాలు కల్పించేవారని, కానీ ప్రస్తుతం స్థానిక సంస్థలను పక్కనపెట్టి ఢిల్లీ, ముంబై, గుజరాత్ వంటి రాష్ట్రాలకు చెందిన పెద్ద కంపెనీలకు టెండర్లు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. దీంతో తెలంగాణ యువత, చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.ప్రభుత్వం పిలిచిన పలు టెండర్లలో మార్కెట్ ధరలకు, కోట్ చేసిన ధరలకు మధ్య భారీ వ్యత్యాసం ఉందని ఆరోపించిన కొప్పుల ఈశ్వర్, ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించిన 93 రకాల వస్తువుల సరఫరా కోసం పిలిచిన రూ.761 కోట్ల టెండర్లలోనే దాదాపు రూ.200 కోట్ల వ్యత్యాసం కనిపిస్తోందన్నారు. ఈ వ్యవహారంలో



వందల కోట్ల రూపాయలు చేతులు మారినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జనవరి నుంచే పాఠశాలల కోసం పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, షూస్ తదితర ఏర్పాట్లు పూర్తి చేసేవాళ్లమని, స్కూళు ప్రారంభం కాగానే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందేవని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం హడావుడిగా, కేంద్రీకృత విధానంలో టెండర్లను నిర్వహించి కొద్దిమందికే లబ్ధి చేకూర్చేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదని, టెండర్లలో అవినీతి జరగలేదని నిరూపించలేక ప్రతిపక్ష నేతలపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా వ్యక్తిగత దూషణలకు పాల్పడటం బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడికి తగదన్నారు.గురుకులాలు, కేజీబీవీలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న లక్షలాది మంది పేద విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించిన కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ పార్టీ తరఫున రూ.2,000 కోట్ల టెండర్లలో అవినీతి జరిగిందనే అంశాన్ని ఆధారాలతో నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

విజన్ ఆంధ్ర
VISION ANDHRA TELUGU DAILY



# పవన్ కళ్యాణ్ పై దేశ ద్రోహం కేసు పెట్టాలి






**- గద్దరన్నకు, సినిమాకు ఏమి సంబంధం..?**
**- రేవంత్ రెడ్డి పాలనలో మన భావజాలంపై దాడి**
**- తెలంగాణ ఉద్యమకాలం ఆనవాళ్లను లేకుండా చేస్తోన్న రేవంత్ రెడ్డి**
**- కరీంనగర్‌లో ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశం - కవిత**

కరీంనగర్ బ్యూరో (విజన్ ఆంధ్ర) జూన్ 18.
తెలంగాణ ప్రజలను ఉగ్రవాదులు, వేర్పాటు వాదులన్న పవన్ కళ్యాణ్ పై దేశ ద్రోహం కేసు పెట్టాలి డిమాండ్ చేశారు.ప్రజల కోసం పోరాటం చేసే మాపై కేసులు పెడతారు? పవన్ కళ్యాణ్ పై కేసు పెట్టేందుకు చేత కావటం లేదా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక తెలంగాణ ఆనవాళ్లను పక్కన పెడుతున్నాడని ఆరోపించారు. అందుకే పక్క రాష్ట్రం నుంచి మళ్లీ పెత్తనం కోసం వస్తున్నారని,ఆంధ్రా నాయకుల విగ్రహాలు పెడుతూ మన నాయకుల విగ్రహాలను విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత కూడా మన హక్కుల కోసం పోరాడటం ఆవేదన కలిగిస్తోందన్నారు.కరీంనగర్ లో జరిగిన ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతూ, కే . కవిత తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు, ప్రభుత్వ వైఖరి, రాష్ట్ర చిహ్నాలు మరియు సాంస్కృతిక గుర్తింపులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ఆమె మాట్లాడుతూ ఉద్యమకారుల కోసం ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని, కమిటీలు వేసి సమస్యలను వాయిదా వేస్తున్నారని విమర్శించారు. ఉద్యమకారులను గుర్తించడంలో ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఉద్యమకారులకు రిజర్వేషన్లు, రవాణా రాయితీలు వంటి సౌకర్యాలు ఉన్నప్పటికీ తెలంగాణలో అవి అమలుకాలేదని చెప్పారు.రాష్ట్ర చిహ్నాలు, విగ్రహాల మార్పులపై కూడా ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపంలో మార్పులు, ఉద్యమ చిహ్నాల తొలగింపు వంటి చర్యలు తెలంగాణ భావజాలానికి వ్యతిరేకమని వ్యాఖ్యానించారు. అలాగే సాంస్కృతిక సంస్థలలో స్థానిక కళాకారులకు ప్రాధాన్యం తగ్గుతోందని విమర్శించారు.రాజకీయ వ్యాఖ్యల్లో భాగంగా, రాష్ట్ర హక్కులు, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి, ఉద్యమకారుల గౌరవం అంశాలపై ప్రభుత్వంపై విమర్శలు చేశారు. అలాగే కొన్ని ప్రజాప్రతినిధుల వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, వాటిపై చట్టపరమైన చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు.ఈ సమావేశం చివర్లో ఉద్యమకారుల హక్కుల కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని, భవిష్యత్ కార్యాచరణపై సూచనలు కోరుతున్నట్లు తెలిపారు. ఉద్యమకారులను న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. ఉద్యమకారులకు అన్ని చేస్తామని చెప్పిన ఈ ప్రభుత్వంలో ఇప్పటి వరకు చలనం లేదన్నారు. మనం పోరాటం చేస్తే కమిటీలు అని వేస్తారు. ఆ తర్వాత రోజే మర్చిపోతారన్నారు ఉద్యమకారులను గుర్తించటానికి కూడా ఈ ప్రభుత్వం 30 నెలలు కాలం గడిపేసిందని అన్నారు. 12 వందల మంది అమరులైతే పట్టించుకోలేదంటూ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇదే కాంగ్రెస్ ఆడిపోసుకుందన్నారు. కానీ వాళ్లు అధికారంలోకి వచ్చి 30 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు పట్టించుకోలేదన్నారు. కొత్త రాష్ట్రాన్ని సాధించుకున్న జార్ఖండ్... వాళ్ల ఉద్యమకారుల కోసం ఎంతో చేస్తోందన్నారు. స్వాతంత్ర సమరయోధులను గుర్తించి గౌరవించినట్లుగా వాళ్ల రాష్ట్ర సాధన కోసం పోరాడిన వాళ్లను గౌరవించుకుంటోందన్నారు. రైల్వే, బస్సు ప్రయాణాల్లో డిస్కౌంట్, జాబ్స్ లలో రిజర్వేషన్లు కల్పించిందన్నారు. అంతేకాకుండా రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మన భావజాలంపై దాడి చేస్తున్నాడని ఆరోపించారు. మన రాష్ట్ర చిహ్నంలో ఉన్న కాకతీయుల చిహ్నం రాచరిక పోకడ అంటూ తీసేశాడు.చార్మినార్, పూర్ణకుంభం కూడా తీసేసే ప్రయత్నం చేస్తే వ్యతిరేకత రావటంతో ఆగిపోయారు.తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో ఇలాగే చేశారు. తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ లేకుండా చేశారు.ఉద్యమ తల్లి విగ్రహానికి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వలేదన్న సాకుతో ఈ ప్రభుత్వం కొత్త విగ్రహాన్ని తెచ్చారు.ఆ విగ్రహంలో బతుకమ్మ లేకుండా చేసి తెలంగాణను అవమానించారు.తెలంగాణ తల్లి విగ్రహం కోసం అసెంబ్లీ లో చర్చ పెడితే మేము వెళ్లాం.కానీ మమ్మల్ని రాకుండా చేసి... ఎలాంటి చర్చ లేకుండానే విగ్రహాన్ని మార్చేశారన్నారు. ఇప్పుడు మనం గూగుల్ లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని వెతికితే ఉద్యమ కాలం నాటి విగ్రహం కనిపించకుండా చేశారన్నారు.అది చాలదన్నట్లుగా రవీంద్రభారతిలో బాల సుబ్రమణ్యం విగ్రహం పెట్టారు.బాల సుబ్రమణ్యం విగ్రహం పెట్టాలంటే ఏ ఫిల్మ్ సిటిలోనో, థియేటర్లలోనో పెట్టుకోవాలి.కానీ రవీంద్రభారతి లో పెట్టారు. రవీంద్ర భారతి అంటే తెలంగాణ కళాకారులకు అడ్డాగా ఉండాలని అన్నారు. గద్దరన్న పేరుతో సినిమా అవార్డులు ఇస్తున్నారు. అసలు సినిమాలతో గద్దరన్నకు ఏం సంబంధం? ఆయన పేరుతో ఒక జానపద అకాడమీ పెట్టాలి. కళాకారులకు అవార్డులు ఇవ్వాలన్నారు. ఇక కరీంనగర్ లో కూడా తెలంగాణ చౌక్ లో అభివృద్ధి కార్యక్రమం పేరుతో మనం 2009 లో పెట్టుకున్న తెలంగాణ తల్లి విగ్రహం తీసేశారు. తెలంగాణ వాదానికి అడ్డా కరీంనగర్. అలాంటి కరీంనగర్ లో తెలంగాణ తల్లి విగ్రహం లేకుండా చేశారు.ఇది మన తెలంగాణ వాదానికి అవమానకరమన్నారు. తెలంగాణ ఉద్యమకాలం నాటి ఆనవాళ్లను పక్కన పెట్టటం ఈ రేవంత్ రెడ్డికి అలవాటుగా మారింది

## కరీంనగర్ టీటీడీ ఆలయ నిర్మాణంపై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుతో వెలిచాల రాజేందర్‌రావు



కరీంనగర్ బ్యూరో (విజన్ ఆంధ్ర) జూన్ 18.
తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బీఆర్ నాయుడును కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలిచాల రాజేందర్‌రావు బుధవారం సాయంత్రం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కరీంనగర్ టీటీడీ ఆలయ నిర్మాణం.. అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. కరీంనగర్ నగరంలోని టీటీడీ ఆలయాన్ని భక్తులకు సౌకర్యవంతంగా నిర్మించేందుకు అవసరమైన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల విస్తరణ, భక్తుల అవసరాలకు అనుగుణంగా నిర్మాణం.. అదనపు సదుపాయాల కల్పన అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.అలాగే ఆలయ ప్రాంగణం అభివృద్ధి, పార్కింగ్ సదుపాయాల విస్తరణ, పరిశుభ్రత నిర్వహణ, తాగునీటి వసతి, భక్తులకు మెరుగైన దర్శన ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ, ఆలయ పరిసరాల సుందరీకరణ వంటి అంశాలపై సానుకూలంగా చర్చ జరిగింది. కరీంనగర్ టీటీడీ ఆలయాన్ని ఉత్తర తెలంగాణ ప్రాంత భక్తులకు మరింత చేరువ చేసే విధంగా నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేయగా, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సానుకూలంగా స్పందించినట్లు వెలిచాల రాజేందర్‌రావు తెలిపారు. ఆలయ నిర్మాణానికి టీటీడీ తరఫున ప్రత్యేక కృషి చొరవ చూపుతామని పేర్కొన్నారని చెప్పారు. భక్తులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో టీటీడీ యాజమాన్యం, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్ టీటీడీ ఆలయం ఆధ్యాత్మికతకు ప్రధాన పాత్ర పోషిస్తుందనీ, భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిర్మాణం చేపట్టేలా నిరంతరం తమ వంతు కృషి చేస్తామని వెలిచాల రాజేందర్‌రావు స్పష్టం చేశారు. కరీంనగర్లో టీటీడీ ఆలయ నిర్మాణానికి.. అభివృద్ధికి సానుకూలంగా స్పందించిన బి.ఆర్ నాయుడుకి వెలిచాల రాజేంద్రరావు కృతజ్ఞతలు

# విద్యను వ్యాపారంగా మార్చిన శ్రీ చైతన్య పాఠశాలలు







- నిబంధనలు పాటించని శ్రీ చైతన్యకు విద్యాశాఖ అధికారుల అండదండలు
- పుస్తకాలు అమ్ముతూ వ్యాపారం చేస్తున్న శ్రీ చైతన్య గుర్తింపు రద్దుచేయాలి ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్

కరీంనగర్ బ్యూరో (విజన్ ఆంధ్ర) జూన్ 18.
కరీంనగర్ నగరంలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలల యజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల పేరుతో పుస్తకాలు అమ్ముతూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని శ్రీ చైతన్య పాఠశాలలో విజ్ఞాన కేంద్రాలుగా కాకుండా వ్యాపార కేంద్రాలుగా మారాయని శ్రీ చైతన్య పాఠశాలలు నిబంధనలు పాటించకపోతే ఆ పాఠశాలలపై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భౌతిక దాడులు చేస్తామని ఒక్క రూపాయి ఎక్కువ ఫీజులు వసూలు చేసిన ఊరుకునేది లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ హెచ్చరించారు. గురువారం ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో కరీంనగర్ నగరంలోని వావిలాలపల్లి లోని శ్రీ చైతన్య పాఠశాల వారు పాఠశాల పేరుతో అధిక ధరలకు పుస్తకాలు అమ్మడాన్ని నిరసిస్తూ ఆ పాఠశాల ముందు ధర్నా చేసి పక్కన ఒక ఇంట్లో ఉన్న పుస్తక స్టోర్ నీ చూపిస్తే మండల విద్యాధికారి వచ్చి స్టోర్ ను సీజ్ చేయకుండా పాఠశాలకు వత్తాసుగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మచ్చ రమేష్ మాట్లాడుతూ శ్రీ చైతన్య పాఠశాలలు విద్యాశాఖ నిబంధనలు పాటించడం లేదని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని శ్రీ చైతన్య పాఠశాల వారు పుస్తకాలను అధిక ధరలకు అమ్ముతూ తల్లిదండ్రుల వద్ద నుండి వేలాది రూపాయల వసూలు చేస్తున్నారని తమ పాఠశాల స్టోర్ లోని పుస్తకాలు కొనాలని విద్యార్థులు, తల్లిదండ్రులకు బెదిరిస్తున్నారని శ్రీ చైతన్య పాఠశాల వారు తోక పేరు అయిన టెక్నో పేరుతో ప్రచారం చేస్తూ ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయకుండా అక్షరాలతో లక్షల వ్యాపారం చేస్తున్నారని విద్యాశాఖ అధికారులు శ్రీ చైతన్య పాఠశాలలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, శ్రీ చైతన్య పాఠశాల వారు నిబంధన విరుద్ధంగా ఒక్క రూపాయి ఎక్కువ వసూలు చేసిన ఊరుకునేది లేదని, ఆ పాఠశాలలపై భౌతిక దాడుల్లోకి దిగుతామని మచ్చ రమేష్ హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లినూనావత్ శ్రీనివాస్ నాయక్, నగర నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి, నాగుల జ్ఞానేశ్వర్, బోయినీ విష్ణు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు

# కరీంనగర్‌లో కట్టుదిట్టమైన భద్రత

- మాదకద్రవ్యాల దుర్వినియోగం పై నివారణ చర్యలు
- కరీంనగర్ బస్టాండ్ మరియు ఆర్టీసీ కార్గో పార్సెల్ కేంద్రంలో తనిఖీలులి
- తనిఖీల్లో పాల్గొన్న పోలీసు జాగిలం - లియో



కరీంనగర్ బ్యూరో (విజన్ ఆంధ్ర) జూన్ 18.
కరీంనగర్: కమీషనరేట్ ప్రజల రక్షణ, శాంతిభద్రతలు, మరియు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కరీంనగర్ పోలీసులు భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశామని కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం తెలిపారు.?దీనిలో భాగంగా, నగరంలోని రద్దీ ప్రాంతాలలో పోలీసులు విస్తృతస్థాయిలో, పోలీసు జగిలాలతో తనిఖీలు, ప్రధాన కూడళ్ళలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాలను అరికట్టడానికి, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువుల కదలికలను గుర్తించడానికి ఈ తనిఖీలు ఉపయోగపడతాయని సీపీ తెలిపారు. ఈ భద్రతా చర్యలకు వాహనదారులు, ప్రజలు సహకరించాలని కరీంనగర్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా పోలీసు కంట్రోల్ రూమ్ మొబైల్ నంబర్ 8712670744 కు తెలియజేయాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో పోలీసు కమీషనరేట్ కి చెందిన పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.